క్లుప్తంగా

నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలందించాలి



అలేఖ్యను సన్మానిస్తున్న నాయకులు

మల్యాల: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన పన్నాటి మల్లేశం–గీత కూతురు పన్నాటి అలేఖ్య వైద్య విద్యను పూర్తిచేసుకున్న సందర్భంగా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. నిరుపేదలకు ఉచితంగా సేవలందించాలని సూచించారు. ఈ సందర్భంగా అలేఖ్య తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు ముల్క మల్లయ్య, ఎంపీటీసీ సామల రేణుక దేవరాజం, బొమ్మకంటి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా లయన్స్ క్లబ్



బాధితులకు సాయం చేస్తున్న క్లబ్ సభ్యులు

ఇబ్రహీంపట్నం: వరద బాధితులకు లయన్స్ క్లబ్ అండగా ఉంటుందని ఇబ్రహీంపట్నం మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్థికంగా దెబ్బతిన్న 15 మంది నిరుపేద కుటుంబాలకు 25 కిలోల బియ్యం బస్తాలు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, దుప్పట్లను ఆదివారం అందజేశారు. క్లబ్ సభ్యుల సహకారంతో ఆపదలో ఉన్నవారికి మరింత సాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు రాజశేఖర్, అశోక్,సత్యనారాయణ,చిన్నారెడ్డి, సుమన్, నర్సయ్య,మోహన్,భూమేశ్, దినేశ్, రమేశ్ తదితరులున్నారు.

గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం



జీపీ భవనం ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కథలాపూర్: మండలంలోని పోతారంలో కొత్తగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రజాప్రతినిధులు ఆదివారం ప్రారంభించారు. ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలతో కొత్త గ్రామ పంచాయతీ భవనం నిర్మించినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచ్ ధర్మపురి జలందర్, ఎంపీటీసీ పులి శిరీషా, ఉపసర్పంచ్ పాలెపు లత, డైరెక్టర్లు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీలు

జగిత్యాల: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కో–కన్వీనర్ ఎం ఏ.చౌదరి అన్నారు. ఆదివారం సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయించి బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు రజిత తదితరులు పాల్గొన్నారు.

పాటల సీడీ ఆవిష్కరణ

కథలాపూర్: వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మినరసింహారావు చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలపై రూపొందించిన పాటల సీడీని ఆదివారం ఆ పార్టీ మండల నాయకులు ఆవిష్కరించారు.మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రామాంజనేయులు సొంత ఖర్చులతో సీడీని రూపొందించాడు. కార్యక్రమంలో ఎంపీటీసీ దొప్పల హైమావతి, సర్పంచ్ గాండ్ల వీణ, నాయకులు ఆకుల నర్సయ్య, దశాగౌడ్, ముజీబ్, దివ్వి రాజు, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హామీ.. నెరవేరదేమీ?

- హైలెవల్ వంతెన లేక రైతుల అష్టకష్టాలు
- వర్షాలు కురిస్తే పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



గతేడాది వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే(ఫైల్)



ఒకరికొకరు చేయి పట్టుకుని వాగు దాటుతున్న రైతులు

ఇబ్రహీంపట్నం: ఏళ్ల తరబడి రైతులు తిప్పలు పడుతున్నా.. నాయకులకు గానీ, అధికారులకు గానీ పట్టింపు లేదు. చిన్న చినుకు పడినా లో లెవల్ వంతెన మునిగిపోతుండడంతో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గంగనాల ప్రాజెక్టు వైపు ఉన్న పంట పొలాలకు వెళ్లేందుకు హైలెవల్ వంతెన లేకపోవడంతో రైతులు రోజుల తరబడి తమ వ్యవసాయ భూములకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పొలాలకు వెళ్లే దారిలో భారీ వర్షాలు పడినప్పుడు ఎగువ ఉన్న పెద్ద చెరువు, ఇబ్రహీంపట్నం, కేశాపూర్, కొజన్ కొత్తూర్, ఎర్దండి గ్రామాల నుంచి భారీగా వరద నీరు వచ్చి ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తోంది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 2001లో అప్పటి సర్పంచ్ ఈ దారిలో లో లెవల్ వంతెనను నిర్మించారు. కానీ భారీ వర్షాలతో లో లెవల్ వంతెన కొట్టుకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ ఏడాది వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉంటుండడంతో ఆయకట్టు రైతులు తమ పొలాలకు వెళ్లలేక తమ పంటలు కాపాడుకోలేకపోతున్నారు. హైలెవల్ వంతెనను నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది జూలై 16న కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు గ్రామానికి వచ్చినప్పుడు హైలెవల్ వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చినా ఇంతవరకూ నిధులు మంజూరు కాలేదు. దీంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. తమ పొలాల వద్దకు వెళ్లేందుకునీటి ప్రవాహాన్ని దాటుకుంటూ ఒకరిసాయంతో మరొకరు వెళ్లాల్సి వస్తోందని రైతులు తెలిపారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేయించి హైలెవల్ వంతెన నిర్మించాలని గ్రామ ప్రజలు, రైతులు కోరుతున్నారు.

భయపడుతూ పోతున్నాం..



భారీ వర్షాలతో రోడ్డు లోలెవల్ వంతెన కొట్టుకపోయింది. తప్పనిసరిగా వ్యవసాయ పనులకు పోయేందుకు నీటి ప్రవాహంలో భయపడుకుంటూ వెళ్లి పనులు చేసుకుంటున్నాం. ఒక్కోసారి నీటి ప్రవాహానికి కొట్టుకపోతామని భయపడుతున్నాం.

– బర్కం నర్సు, రైతు, వేములకుర్తి

వంతెన నిర్మించాలి



వ్యవసాయ భూములకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులకు గురి అవుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని హైలెవల్ వంతెనకు నిధులు మంజూరు చేయించి వంతెన నిర్మించాలి. ఎన్ని సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– రాధరాపు దేవదాస్, రైతు, వేములకుర్తి

వంతెన స్థలాన్ని పరిశీలిస్తాం



హైలెవల్ వంతెన నిర్మాణానికి ఎలాంటి అంచనాలు, ప్రతిపాదనలు తయారు చేయలేదు. ఈ అంశం మా దృష్టికి రాలేదు. పై అధికారులతో కలిసి వేములకుర్తిలో కొట్టుకపోయిన లో లెవల్ వంతెన స్థలాన్ని పరిశీలిస్తాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే వంతెన నిర్మిస్తాం.

– అరుణ,పీఆర్, ఏఈ, ఇబ్రహీంపట్నం

కుల సంఘ భవనాలకు ప్రత్యేక నిధులు



రాయికల్‌లో వడ్డెర సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: నియోజకవర్గంలో అన్ని గ్రామాలు, పట్టణాల్లో అన్ని కుల సంఘ భవనాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్‌లో రూ.5 లక్షలతో నిర్మించిన వెల్మ సంక్షేమ సంఘ భవనాన్ని రూ.3 లక్షలతో నిర్మించే గౌడ సంఘం అదనపు పనులను ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ కులానికి పక్కా సంఘ భవనం ఉండాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో అన్ని కులాలకు లక్షలాది రూపాయలు వెచ్చించి భవనాలు నిర్మించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్, కేడీసీసీ జిల్లా డైరెక్టర్‌ముప్పాల రాంచందర్‌రావు, దావ సురేశ్, సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ మల్లారెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కుల వృత్తులకు ప్రాధాన్యత

రాయికల్: కుల వృత్తులకు సీఎం కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం రాయికల్ పట్టణంలోని ఒడ్డెర సంఘ భవనాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో అన్ని కుల వృత్తుల వారికి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. రాయికల్ మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత పట్టణంలోని అన్ని కుల సంఘ భవనాలకు నిధులు మంజూరు చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

సారంగాపూర్: మండలంలోని నాగునూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిట్నేని రవీందర్ రావు, మహేశ్, రమేశ్, తదితరులు ఉన్నారు.

మల్లన్న ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో ఆదివారం మల్లన్నస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చెన్నమనేని శ్రీనివాస్‌రావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌కుమార్, జంగిలి సునీత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, సర్పంచ్ బద్దం సరిత, ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి లత, గ్రామస్తులు పాల్గొన్నారు.

నియామకం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కొమ్ముల చిన్నారెడ్డి

మల్లాపూర్: కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కొమ్ముల చిన్నారెడ్డి(పాతదాంరాజుపల్లి)ను నియమిస్తూ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీసీసీ జిల్లా అధ్యక్షుడు అట్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు మండల అధ్యక్షుడి నియామక పత్రాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి ఆయన అందజేశారు.తన నియామకానికి సహకరించిన నాయకులకు చిన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం

రాయికల్: మండలంలోని వీరాపూర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా సోమ స్వామి, ఉపాధ్యక్షుడిగా నీలి వెంకన్న, కార్యదర్శిగా సోమ సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా నీలి ఆనందం, కోశాధికారిగా సోమ వెంకటేశ్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడిగా మణియాదవ్

రాయికల్: మండలంలోని తాట్లవాయి శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడిగా కంది మణియాదవ్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సభ్యులు తిరుపతి, మహేశ్, మధు, మల్లయ్య, రమేశ్, శేఖర్, గంగమల్లయ్య పాల్గొన్నారు.

తెలుగు భాష అభ్యసనాభివృద్ధి సమితి కమిటీ ఏర్పాటు

జగిత్యాల: తెలుగు భాష అభ్యాసనాభివృద్ధి సమితి నూతన కమిటీ ఆదివారంఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్, సలహాదారులుగా మనోహరచారి, ఉపాధ్యక్షులుగా భాను, కవిత, వేణుగోపాల్, రమేశ్, సూర్యనారాయణ, మద్దెల సరోజన, భూలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా రంగ శ్రీనివాస్, సభ్యులుగా వనజ, అపర్ణ, లక్ష్మి, వాణి, సంధ్యారాణి, అలీరాజ, గిరీష్, ఎల్లయ్య ఎంపికయ్యారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

మల్యాల: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన 100 మంది కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు కండువాలు కప్పి, ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గడప గడపకు సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని సూచించారు.

గల్ఫ్ కార్మికులకు అండగా గల్ఫ్ రక్షణ సమితి

మల్యాల: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మిరుప జల(32) జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లి అక్కడే గుండెపోటుతో మృతిచెందగా, గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి మృతదేహాన్ని ఈ నెల 8న స్వగ్రామానికి తరలించింది. మృతురాలి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకవచ్చేందుకు సహకరించాలని జెడ్పీటీసీ రాంమోహన్ రావు, కొండగట్టు డైరెక్టర్ జున్ను సురేందర్, సర్పంచ్ బద్దం తిరుపతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షుడు గుండెల్లి నరసింహ, శేఖర్ గౌడ్‌కు తెలియజేయగా, మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. గల్ఫ్‌లో మృతిచెందిన కార్మికులకు గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అండగా నిలుస్తోందని, ప్రభుత్వం మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని,ఒకరికి ఉద్యోగం కల్పించాలని గల్ఫ్ రక్షణ సమితి అధ్యక్షుడు నరసింహ డిమాండ్ చేశారు.

ఫెడరేషన్ గేమ్స్ ఎంపిక పోటీలు

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో ఈ నెల 13,14న ఫెడరేషన్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ఐత శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 6,7,8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఫెడరేషన్ గేమ్స్ ఎంపిక పోటీలు బాలికలకు 13న బాలురకు 14న నిర్వహించనున్నామని పేర్కొన్నారు. 6,7,8 విద్యార్థులకు అండర్– 14 విభాగంలో, తొమ్మిది నుంచి ఇంటర్ సెకండియర్ వరకు అండర్–17 విభాగంలో ఎంపిక కోసం పోటీలు నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు పీడీ విశ్వప్రసాద్ 9440037374 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల కమిటీలో అవేజ్‌కు చోటు



అవేజ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి/మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అవేజ్ కు తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల కమిటీలో చోటు దక్కడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల కమ్యూనికేషన్ కమిటీ సభ్యునిగా అవేజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వేంపేటలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, వేంపేట ఉపసర్పంచ్ ప్రవీణ్, నాయకులు సురేందర్, రాజారెడ్డి,లింగారెడ్డి, మహేశ్, శ్రీనివాస్,శేఖర్,రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు ఘననివాళి





కోరుట్లలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు రాయికల్‌లో రజకుల నివాళి..



కథలాపూర్‌లో నాయకుల నివాళి



పెగడపల్లిలో..

కోరుట్ల/మెట్‌పల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగుదామని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. ఆదివారం కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకల్లో పాల్గొని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, వైస్‌చైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్లు, తెలంగాణ జన సమితి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్ల గంగనర్సు, ఉపసర్పంచ్ పద్మ, రజక సంఘం అధ్యక్షుడు బొల్లారపు రాజేశం, సభ్యులు పాల్గొన్నారు.

పెగడపల్లి: చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఆదివారం మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు నామాపూర్‌లో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి సర్పంచ్ లత, ఎంపీటీసీ రాములు, రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కథలాపూర్: మండలకేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం మండలాధ్యక్షుడు చిలుమల మహేశ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు, మండలంలోని ఇటిక్యాల, మైతాపూర్ గ్రామాల్లో చాకలి అయిలమ్మ వర్ధంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు సంగెం –శ్రీరాంపూర్, సిరిపూర్, సాతారం, కుస్తాపూర్ గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రజక సంఘాల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాసి వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో రజక సంఘం నాయకులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

సారంగాపూర్: చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సారంగాపూర్, అర్పపల్లిలో ఆదివారం ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, రజకులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతు సంఘం కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

మల్యాల: మండల కేంద్రంలోని ఆదర్శ రైతు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కైలాసపు భూమయ్య, ప్రధాన కార్యదర్శిగా సంగ నారాయణ, కోశాధికారిగా ముదాం తిరుపతి, సలహాదారులుగా ముస్కు శంకర్, గౌరవాధ్యక్షులుగా నక్క మల్లయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు అభినందించారు.

సేంద్రియ వ్యవసాయ సాగుపై శిక్షణ

జగిత్యాలరూరల్: మండలంలోని లక్ష్మీపూర్‌లో ఆదివారం రైతునేస్తం ఫౌండేషన్ నాబార్డ్ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయ సాగు మిశ్రమాలు, కషాయాల తయారీ వివిధ ఆహార పంటల విలువ జోడిపై రైతులకు శిక్షణ ఇచ్చారు.

మంత్రిని కలిసిన ముదిరాజ్ నాయకులు

పెగడపల్లి: మండలంలోని వెంగళాయిపేట గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు ఆదివారం కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఈశ్వర్‌ను కలిశారు. ముదిరాజ్ సంఘం భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించుకోగా, మంత్రి నిధుల మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, వెంకన్న, తిరుపతి, కరుణాకర్, ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జ్యోతి స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలు పాల్గొని గతంలో సాంప్రదాయాలు, ప్రేమల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు హరిచరణ్‌రావు, రజితరావు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు పంపిణీ

రాయికల్: మండలంలోని రాజనగర్‌లో పాడి రైతు ఊరె సంజీవ్ –లక్ష్మి దంపతుల కుమార్తె వివాహం ఆదివారం జరుగగా, కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చల్ల శ్రీనివాస్, సూపర్‌వైజర్ రాజేశ్, కార్యదర్శి అశోక్, చిరంజీవి డెయిరీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద నిబంధనలు పాటించాలి

పెగడపల్లి: గణేశ్ నవరాత్రి సందర్భంగా వినాయక మండపాల వద్ద నిబంధనలు పాటించాలని ఎస్సై సతీశ్ సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడారు.అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, రాత్రి మండపాల వద్ద నిర్వాహకులు ఉండాలన్నారు. వేడుకల్లో అల్లర్లకు తావుండకూడదని ఎస్సై పేర్కొన్నారు. చవితి వేడుకల్లో అలర్లకు పాల్పడకుండా శాంతియుతంగా నవరాత్రోత్సవాలు జరుపుకోవాలని నిర్వాహకులకు సూచించారు. సమావేశంలో రాజకీయ పార్టీల మండల నాయకులు, ముస్లిం మత పెద్దలు, యువజన సంఘాల సభ్యులు, ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కమలం గూటికి లింగారెడ్డి



లింగారెడ్డికి బీజేపీ కండువా కప్పుతున్న ఎంపీ

మెట్‌పల్లి: కోరుట్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు మొదటి షాక్ తగిలింది. ఆ పార్టీలో ముఖ్యనేత, మాజీ జెడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి కమలం గూటికి చేరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీసీ వర్గానికి చెందిన లింగారెడ్డికి మెట్‌పల్లి మండలమే కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా మంచి పట్టుంది. 2005లో జరిగిన స్థానిక ఎన్నికల్లో మొదటిసారి మెట్‌పల్లి నుంచి కాంగ్రెస్ తరపున జెడ్పీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరి ఉమ్మడి జిల్లా కోకన్వీనర్‌గా పని చేశారు. ఆ పార్టీ తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగా లేకపోవడంతో దానికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటినుంచి పార్టీలో చురుకుగా వ్యవహరిస్తున్నప్పటికీ తనకు సముచిత స్థానం కల్పించడం లేదని ఆయన కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో తన అనుచరులతో చర్చలు జరిపి వారి సూచనతో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. లింగారెడ్డి బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరడంతో స్థానికంగా రాజకీయ సమీకరణాలు మారనున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.